www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 12 జనవరి 2024



తేక్వాండోలో అన్నమయ్య అకాడమీ క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈ నెల 10వ తేదీన ప్రొద్దుటూరులో జరిగిన 37వ జిల్లా స్థాయి తేక్వాండో పోటీలలో రాజంపేట తేక్వాండో అన్నమయ్య అకాడమీ క్రీడాకారులు ఎనిమిది మంది పతకాలు సాధించి సత్తా చాటారని మాస్టర్ పిచ్చయ్య తెలియజేశారు. గురువారం అన్నమయ్య అకాడమీలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు అభినందన సభ ఏర్పాటు చేసి వారికి జ్ఞాపికలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ కె.వి.వినయ్ కుమార్ రజిత పతకం, జయదీప్, అన్విత, జకియా, జోహెబ్, ఉమర్, ఆర్.వి.బద్రి కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. తమ అకాడమీ నుంచి క్రీడాకారులు పథకాలు సాధించడం పట్ల కోచ్‌లు జాహిద్ అలీ, జ్ఞాన సాయి, క్రీడాకారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.


పతకాలు సాధించిన క్రీడాకారులు

31 అంకెకు నిప్పుపెట్టి వినూత్న నిరసన

- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు
- ఒంటి కాలిపై నిల్చుని ప్రదర్శన
- 31వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీ చేస్తున్న సమ్మె గురువారం నాటికి 31వ రోజు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించినా, విధుల నుంచి తొలగిస్తామని షోకాజ్ నోటీసులు జారీ చేసినా తమ ఆందోళనను కొనసాగిస్తూనే ఉన్నారు. 31వ రోజు గుర్తుగా కలెక్టర్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో 31 అంకెను ఏర్పాటు చేసి మంటలు వేసి వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి, వేతనాలు పెంచాలి, నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలి, మినీ సెంటర్ ను మెయిన్ సెంటర్ గా మార్చాలి, ముఖ్యమంత్రి హామీలను అమలు చేయాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ అ సంక్రాంతిలోపు సమ్మెలో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే అన్ని పార్టీలతో ప్రత్యక్ష ఆందోళనకు దిగడంతోపాటు, రాష్ట్ర బంద్ చేపడతామని హెచ్చరించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీలపై అధికారులు అనేక రకాలైన ఒత్తిళ్లు తీసుకొస్తు బెదిరిస్తున్నారని, వారి బెదిరింపులు సాగవన్నారు. అంగన్వాడీ వర్కర్లు ఎవరు అధైర్య పడవద్దు అని అధికారుల ఒత్తిళ్లకు తలవంచవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, కోశాధికారి బంగారుపాప, నాయకులు రమాదేవి, మధురవాణి, కుమారి, సుమలత, అరుణ అంగన్వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** అంగన్వాడీలు తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె 31వ రోజుకు చేరుకుంది. పట్టణంలోని స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం, గ్రాట్యూటీ అమలు, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించడం, నాణ్యమైన పౌష్టికాహారం సరఫరా చేయడం, హెల్పర్లకు పదోన్నతులు కల్పించడం తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో అంగన్వాడీ వర్కర్లు మరియు హెల్పర్లు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిల్చుని అంగన్వాడీలు నిరసన తెలియజేశారు. ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి మాట్లాడుతూ ప్రధానమైన డిమాండ్లలో వేతనాల పెంపు అంశం వదిలేసి సమస్యలు పరిష్కరించామని అంగ్వాడీలపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి ఓబులమ్మ, సెక్టార్ లీడర్లు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **మదనపల్లి :** అంగన్వాడీల నిరవధిక సమ్మెను పరిష్కరించక వారిపై ప్రభుత్వం నిర్భంధాన్ని ప్రయోగించడాన్ని సిఐటియు జిల్లా కోశాధికారి హరిశర్మ ఖండించారు. మదనపల్లి ఐసిడిఎస్ ప్రాజక్టు ఆఫీసువద్ద ఉన్న దిక్షాశిబిరాన్ని సందర్శించి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. మహిళల పట్ల ప్రభుత్వం సానుభూతితో సమస్యలు తీర్చాలన్నారు. మదనపల్లి ప్రాజెక్టు అంగన్వాడీ కార్యకర్తల పోరాటానికి మద్దతు తెలిపిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా నాయకులు సోమశేఖర్ సంఘీభావంత తెలిపి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం తప్పన్నారు.


రాయచోటి : 31 అంకెకు నిప్పుపెట్టి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


లక్కిరెడ్డిపల్లె : ఒంటి కాలిపై నిల్చుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


మదనపల్లె : మాట్లాడుతున్న ఐలు నాయకులు సోమశేఖర్‌రెడ్డి

వైసిపి సిట్టింగుల్లో గుబులు

వైసిపి సిట్టింగుల్లో గుబులు రేగుతోంది. వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సర్వే ఆధారంగా టికెట్లు ఖరారు చేయనుండడం ఆందోళనకు కారణమని తెలుస్తోంది. సర్వేలను ఆధారం చేసుకుని రాష్ట్ర వ్యాప్తంగా 72 మందికిపైగా అభ్యర్థులను మార్చనున్నట్లు అందుతున్న సంకేతాలు వెలువడిన నేపథ్యంలో కడప, అన్నమయ్య జిల్లా పరిధిలోని 13 అసెంబ్లీ స్థానాల్లో ఏడుగురు ఎమ్మెల్యేల్లో అయోమయం నెలకొంది. ఐదు అసెంబ్లీ స్థానాల పరిధిలోని ఆశావహులు అభ్యర్థిత్వానికి నువ్వానేనా అనే రీతిలో కొనసాగుతుండడం కంటిమీద కునుకుపడని పరిస్థితి నెలకొంది. వీరందరూ సిఎం ఫేషీలోని ఓ కీలక ఐఎఎస్ అధికారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడినట్లు సమాచారం.


- సర్వే ఆధారిత ఖరారుతో కలవరం
- ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేల్లో గందరగోళం
- ఐదుగురు ఎమ్మెల్యేల్లో టెన్షన్..టెన్షన్..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో టికెట్ల ఫైట్ పతాక స్థాయికి చేరుకుంది. ప్రతిపక్ష టిడిపి, జనసేన సమ న్వయంతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో వైసిపి అప్ర మత్తమైంది. ప్రతిపక్ష పార్టీల పొత్తు ప్రభావం కని పించే ప్రాంతాలపై దృష్టి సారించింది. కడప జిల్లాలో కడప, పులివెందుల, బద్వేల్, అన్న మయ్య జిల్లాలో రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లి మినహా మిగిలిన ప్రాంతాలపై తీవ్రంగా కసరత్తు చేస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచే గడప గడపకూ పేరుతో ఎమ్మెల్యేల పట్ల ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని తగ్గించే ప్రయత్నం చేసింది. వెనుకబడిన ఎమ్మెల్యేలను గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే.

వైసిపిలో నువ్వానేనా

మూడు నెలల వ్యవధిలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో టికెట్లు లభించని ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తోంది. కడప జిల్లా పరిధిలోని కమలాపురం, మైదుకూరు, జమ్మలమడుగు, అన్నమయ్య జిల్లాలో రాజంపేట, మదనపల్లి ఎమ్మెల్యేల టికెట్లు కేటాయింపులపై నీలినీడలు అలముకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కడప జిల్లాలోని మైదుకూరు, కమలాపురం అభ్యర్థు లను పిలిపించుకుని చర్చించినట్లు సమా చారం. పులివెందుల, ప్రొద్దు టూరు, బద్వేల్, రైల్వేకోడూరు, రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లి మినహా కడపలో డిప్యూటీ సిఎం, ఆయన సోదరుడు, మాజీ మంత్రి ఖలీల్‌బాషా కుమారుడు, ఇతర మైనార్టీ నాయకునితో కలిపి ఐదుగురు, కమలాపురంలో ఎం



ఎల్‌ఎతో పాటు, ఆయన సమీప బంధువు ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, సహా మరొకరు, మైదుకూరులో ఎమ్మెల్యే కుమారుడు, సిఎం సమీప బంధువులు ఇద్దరు, జమ్మల మడుగులో ఎమ్మెల్యేతోపాటు పులివెందులకు చెందిన కీలక నేత, రాజంపేటలో ఎమ్మెల్యేతోపాటు జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాధరెడ్డి, వీరబల్లి ప్రాంతానికి చెందిన నాయకుడు, మదన పల్లిలో ఎమ్మెల్యేతోపాటు మరో మైనార్టీ నాయకులు నిసార్‌అహ్మద్ వంటి ఆశావ హులు టికెట్ కోసం పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. టికెట్లు కేటాయించడంపై గందరగోళం నెలకొంది.

సర్వేలతోనే దిశానిర్దేశం

అధికార వైసిపిలో సర్వేల ఆధా రంగానే టికెట్లు లభించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సుమారు నాలుగు, ఐదు సర్వేలను ముందు ఉంచుకుని నియోజకవర్గాల వారీగా సర్వేలు తేల్చిన ప్రజాదరణ కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యేల పనితీరును పరిశీలించి నిర్ణయం తీసు కుంటున్నట్లు తెలుస్తోంది. కడప జిల్లాలో మైదు కూరు, అన్నమయ్య జిల్లాలో రాజంపేట ఎమ్మెల్యేలు గడప గడపకూ కార్యక్రమంలో ఆశించిన పనితీరు ప్రదర్శించడంతో నిర్లక్ష్యం నెలకొనడంతో గుర్తించి హెచ్చరించిన సంగతి తెలిసిందే.

ఓ ఐఎఎస్ చుట్టూ ప్రదక్షిణలు

ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యే అభ్యర్థిత్వాల కోసం సిఎం ఫేషీకి క్యూ కట్టినట్లు సమాచారం. ఆ ఐఎఎస్ ఆఫీసర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి ఆయన రాజకీయపరమైన అంశాలు తనకేమీ సంబంధమని వాపోతున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేల తాకిడికి భరించలేక కరోనా పేరుతో నాలుగు రోజుల పాటు సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఏదేమైనా సర్వేల ఆధారంగా టికెట్లు ఖరారు చేస్తుండడంతో అధికార పార్టీ అభ్యర్థుల్లో ఎవరికి టికెట్లు లభిస్తాయోననే టెన్షన్ నెలకొంది.

ప్రతి స్టేషన్‌లోనూ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి

- గుంతకల్లు డివిజన్ డిఆర్‌యుసిసి సభ్యులు భరత్‌కుమార్‌రెడ్డి


డిఆర్‌ఎంకు వినతిపత్రం ఇస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రతి స్టేషన్‌లోనూ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని గుంతకల్లు డివిజన్ డిఆర్‌యుసిసి సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాజంపేట, రైల్వేకోడూరుకు సంబంధించిన రైల్వే సమస్యలు, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రతి స్టేషన్‌లోనూ నిలుపుదల చేయడంపై గురువారం గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ మనీష్ అగర్వాల్‌ను ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ నంద్యాల నుంచి కడప వరకు డెమో రైలును రేణిగుంట వరకు పొడిగించారన్నారు. ఆ రైలును కడప నుంచి అన్ని రైల్వే స్టేషన్లలో స్టాపింగ్ కల్పించాలని కోరారు. ఓబులవారిపల్లె, నందలూరు రైల్వేస్టేషన్లో వెంకటాద్రి, తిరుమల ఎక్స్‌ప్రెస్, మరికొన్ని సూపర్ ఫాస్ట్ రైళ్లను ఆపడానికి అవకాశం కల్పించాలని కోరామన్నారు. బ్రిటిష్ కాలం నుండి ప్రసిద్ధిగాంచిన రెడ్డిపల్లె రైల్వే స్టేషన్లో బొగ్గు, ఎర్రగడ్డలు, నిమ్మకాయలు, మామిడికాయలు తదితర వాటినే విదేశాలకు ఎగుమతి చేసేందుకు అనువైనదని తెలిపారు. కరోనా కంటే ముందు వరకు రెడ్డిపల్లి రైల్వే స్టేషన్లో ఇంటర్‌సిటీ, అరకోణం రైలును ఆపేవారని, ప్రస్తుతం వాటిని నిలిపివేశారన్నారు. వాటిని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. రాజంపేట, రైల్వేకోడూరులో కరోనా కంటే ముందు ఆగుతున్న హరిప్రియ ఎక్స్ ప్రెస్, చెన్నై సెంట్రల్ మెయిల్ ఆపాలని తెలియజేశారు. రైల్వేకోడూరు అండర్ బ్రిడ్జి డబుల్ రోడ్డు, ఓబులవారిపల్లి అండర్ బ్రిడ్జి, రాజంపేట రైల్వేస్టేషన్ దగ్గర ఉన్న అండర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని కోరారు. రాజంపేట, రైల్వేకోడూరులోని వికలాంగులకు రైలు పాసులు తొందరగా మంజూరు చేయాలని తెలిపారు. నందలూరులో ఉన్న ఓల్డేజ్ రైల్వే పెన్షన్ దారులకి క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయవలసిందిగా డిఆర్ఎం దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు.

సామాజిక న్యాయ మార్గంలో నడవాలి : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి

ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో సామాజిక సమతా సంకల్పంలో భాగంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఛాయా చిత్ర ప్రదర్శనను ఎమ్మెల్యే, జెసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 19న విజయవాడలో దాదాపు రూ.400 కోట్లతో 20 ఎకరాలలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటుతో పాటు 125 అడుగుల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా ఘనంగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ అంబేద్కర్ ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప దార్శనికుడని, సామాజిక న్యాయం సాధించడంలో ఆయన మార్గం అనుసరణీయమని తెలిపారు. ఆ మహానేత జీవిత చరిత్ర, ఆయన సమాజానికి చేసిన సేవ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఆయన అడుగుజాడలు అందరికీ ఆదర్శం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి, సమాచార శాఖ డిఐపిఆర్‌ఒ భరత్ కుమార్ రెడ్డి, డిపిఆర్ఒ పురుషోత్తం, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, అధికారి మనోహర్ రాజు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జాకీర్ హుస్సేన్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్.శివశంకర్, సి.అంజన్నప్ప, కె.వి.రమణ, నగర ప్రముఖులు పాల్గొన్నారు.


అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, జెసి, డిఆర్ఒ


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ముగిసిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి-గాలివీడు

డిసెంబర్ 20 నుంచి ప్రారంభమైన డిగ్రీ మొదటి, రెడు మూడో సెమిస్టర్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఆర్ ఆర్ డిగ్రి కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్ర రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో 250 మంది పరీక్ష ఫీజు చెల్లించారని, వారిలో పది మంది గైర్హాజరయ్యారని తెలిపారు. యోగి వేమన యూనివర్సిటీ పరిధిలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎటువంటి అవాంఛనీయ సంగటనలు జరగకుండా అబ్జర్వర్ల ఆధ్వర్యంలో ముగిశాయన్నారు.


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

చిరు వ్యాపారులకు వరం 'జగనన్న తోడు'

- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్న తోడు చిరు వ్యాపారులకు వరం లాంటిదని శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ప్రభుత్వ విప్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జగనన్న తోడు 8వ విడతలో భాగంగా చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు పొంది సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న తోడు పథకం పేద ప్రజలకు వరం లాంటిదని ఈ పథకాన్ని అర్హులందరు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు 10 వేలు వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతో మహిళల ముఖంలో చిరునవ్వులు కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ డబ్బును తీసుకున్న అవసరాలకు మాత్రమే ఖర్చు చేసి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మన రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలకు అండగా నిలవడం జరుగుతోందన్నారు. ఇలాంటి ప్రభుత్వం పదికాలాలపాటు ఉండేటట్లు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ జగనన్న తోడు పథకం 8వ విడతలో జిల్లాలో మొత్తం 13,269 మంది లబ్ధిదారులకు రూ.1404.00 లక్షలు వారి ఖాతాలో నేరుగా జమ చేశామన్నారు. సకాలంలో చెల్లించిన 17,698 మందికి రూ.42.43 లక్షలు వడ్డీ రియంబర్స్మెంట్ కింద జమ చేస్తారన్నారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని, వ్యాపారులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే మళ్ళీ వడ్డీ లేని రుణాలు పొందవచ్చుని చెప్పారు. వీధి వ్యాపారులకు బాసటగా నిలుస్తున్న జగనన్నతోడు పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వారు లబ్ధిదారులకు మెగాచెక్కును అందజేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

పారదర్శక ఓటర్ల జాబితాకు కృషి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో పారదర్శకంగా జాబితా రూపొందించడానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలలో లక్ష్యాలను సాధించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం విజయవాడ సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి సార్వత్రిక ఎన్నికలు, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ పథకం, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, మహిళా శిశు సంక్షేమం, మూడవ దశ రీ సర్వే, ఇనామ్, అసైన్డ్ భూములు, హౌసింగ్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి సమీక్షించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జెసితోపాటు డిఆర్ఒ సత్యనారాయణ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జెసి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలో భాగంగా అభ్యంతరాలపై అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. బిఎల్ఒ, ఇఆర్ఒ లాగిన్‌లో ఏడు రోజులు పైబడిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ క్యాంపులను పట్టిష్టంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ఉపాధి హామీలో లక్ష్యాలను పూర్తి చేయాలని, మూడో దశ రీ సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఇనామ్, అసైన్డ్ భూములు, హౌసింగ్ తదితర అంశాల లక్ష్యాలపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాహుల్‌ను ప్రధానిని చేద్దాం : 'గాజుల'

ప్రజాశక్తి- రాయచోటి

రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేసేందుకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా మాణిక్యం ఠాగూర్ చెప్పినట్లు రాయచోటికి చెందిన గాజుల భాస్కర్ పేర్కొన్నారు. గురువారం ఆయనను కలిసినట్లు చెప్పారు. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం, రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి, అన్నమయ్య డిసిసి అధ్యక్షుడు షేక్ అల్లాబకష్‌తో కలిసి సన్మానించినట్లు చెప్పారు.

రాజంపేట వైసిపి ఇన్‌ఛార్జిగా 'ఆకేపాటి'



కడప ప్రతినిధి : రాజంపేట వైసిపి ఇన్‌ఛార్జిగా ఆకేపాటి అమరనాధరెడ్డి దక్కించు కున్నారు. వైసిపి అధిష్టానం తరుపున సజ్జల, బొత్స సత్యనారాయణ గురువారం రాత్రి విడుదల చేసిన జాబితాలో అమ రనాధరెడ్డి పేరు ప్రకటించారు. ప్రస్తుత ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి 2015, 2019 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, వైసిపి తరుపున టికెట్లను దక్కించుకుని గెలుపొందిన సంగతి తెలిసిందే. తాజాగా మూడవ దఫా వైసిపి తరుపున టికెట్ దక్కించుకుని ఎన్నికల బరిలో దిగాలనే ప్రయత్నం బెడిసి కొట్టినట్లు తెలు స్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల టికెట్ల కేటాయింపుల్లో సర్వేల్లో ఆదరణ కలిగిన అభ్యర్థులకు టికెట్లను ఖరారు చేస్తున్న నేపథ్యంలో రాజంపేట నియో జకవర్గంలో బిసిలను విస్మరించడం, గడప గడపకూ కార్యక్రమాల ఆధారంగా ప్రజావ్యతిరేకతను తగ్గించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలించ లేదని తెలుస్తోంది.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : 'కస్తూరి'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రంలో వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు అన్నారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐదు కోట్ల ప్రజానీకానికి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను, భూ కబ్జాలను, దోపిడీలను ఎత్తిచూపేందుకు నారా చంద్రబాబునాయుడు రా కదలిరా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. వైసిపి పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఇసుక, గ్రానైట్ మైనింగ్ పేరుతో రూ.లక్షల కోట్లు దోపిడీ చేశారన్నారు. రాష్ట్రం బాగుపడాలన్నా, అభివృద్ధి జరగాలన్నా, ఉపాధి కావాలన్నా, నిరుద్యోగం పోవాలన్నా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడితే తప్ప మరో మార్గం లేదని పేర్కొన్నారు. సమావేశంలో నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వెంకటసుబ్బయ్య, మండలఅధ్యక్షులు కొమ్మ శివ, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు కమతం నాగరాజు, రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు పులేల రమేష్, రాజంపేట పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు తేనేపల్లి చిన్న, గడ్డం శ్రీరాములు, మధు తదితర నాయకులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** వైసిపి అన్యాయాలను, అక్రమాలను ఎత్తిచూపేందుకు చంద్రబాబు ఇటీవల అచంట, ఆళ్లగడ్డ, తుని, బొబ్బిలి తదితర ప్రాంతాల్లో జనసేన, టిడిపి నాయకులు సమన్వయంతో నిర్వహించిన రా.. కదలిరా బహిరంగ సభలకు జనాలు తండోపతండాలుగా తరలివచ్చి విజయవంతం చేస్తున్నారని, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్రాయుడు తెలిపారు. పట్టణంలోని బత్యాల భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయేది తెలుగుదేశం, జనసేన ప్రభుత్వమేనని జోష్యం చెప్పారు. ఉమ్మడి కడప జిల్లాలో అన్ని సీట్లు గెలవబోతున్నామన్నారు. జిల్లా ప్రజల స్పందన జోరుకు వైసిపి ప్రభుత్వం పతనం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పదాధికారులు పాల్గొన్నారు.



రైల్వేకోడూరు : సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాధనాయుడు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో మేనేజ్‌మెంట్ సభ్యులు

ఉద్యోగాలకు ఎంపికైన 'ఆదిత్య' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎం.కోర్ టెక్ అకాడమీ ప్రయివేట్ లిమిటెడ్ బెంగళూరు వారిచే డ్రైవ్ నిర్వహించిన ఈ డ్రైవ్‌లో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఇఇఇ, ఇసిఇ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని వారిలో 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారని డైరెక్టర్ రామలింగారెడ్డి రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు బెంగళూరులో ఉద్యోగం చేయవలసి ఉంటుందని వీరికి సంవత్సరానికి రూ.3 లక్షల ప్యాకేజీ ఇవ్వబడుతుందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి వీరిని అభినందిస్తూ భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు వీరిని అభినందించారు. కార్యక్రమంలో ఎం.కోర్ టెక్ అకాడమీ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ఆర్ ఎ. పార్థసారథియాదవ్, టిపిఒ మనోజ్ కుమార్, ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

సిఆర్‌సిని కలిసిన 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



సిఆర్‌సిని సన్మానిస్తున్న శ్రీనివాసరాజు

జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు, ఆయన సోదరుడు యల్లటూరు శివరామరాజులు ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్యను కడప పట్టణంలోని ఆయన స్వగృహంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. రానున్న ఎన్నికలలో రాజంపేట నియోజకవర్గం నుండి జనసేన తరపున తనకు అవకాశం లభిస్తే ఆశీస్సులు, సహాయ సహకారాలు అవసరమని శ్రీనివాసరాజు త్వరగా ఆయనకు సానుకూలంగా స్పందించిన రామచంద్రయ్య తప్పకుండా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపినట్లు శ్రీనివాసరాజు తెలియజేశారు. కార్యక్రమంలో నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ పాల్గొన్నారు. **గీతాంజలి రమణను కలిసిన దినేష్...:** గీతాంజలి సంస్థల అధినేత రమణను ఆయన స్వగృహంలో జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేష్, నాయకులు అతికారి కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. రమణకు శ్రీవెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించి శాలువాతో సత్కరించారు.

ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ఠాగూర్‌ను కలిసిన శ్రీనాథ్

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ఠాగూర్‌ను విజయవాడలో పిసిసి కార్యవర్గ సభ్యులు అత్తింజేరి శ్రీనాథ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



పంటలను పరిశీలిస్తున్న ప్రసాద్‌రెడ్డి

ఉద్యాన పంటల పరిశీలన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలంలోని ఊటుకురు పంచాయతీ పరిధిలోని ఉద్యాన పంటలను గురువారం ప్రభుత్వ ఉద్యాన సలహాదారులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యాన శాఖ ద్వారా అమలు అవుతున్న వివిధ పథకాలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌బికెల ద్వారా వివిధ ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు ఖచ్చితంగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా ప్లాస్టిక్ మల్చింగ్ సబ్సిడీ పొందిన రైతును పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు నాగేశ్వర రాజు, ఉద్యాన విస్తరణ అధికారి పూర్ణచంద్ర, ఉద్యాన సహాయకుడు చెంగల్ రాయుడు, చెంగల్ రాజు, రైతులు మురళి, మురుగ రాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక బృందం ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. పాల్గొన్న వారందరూ సంక్రాంతి ముగ్గులు, రంగోలి, చేతితో తయారు చేసిన కళాఖండాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి తెలుగుతనం ఉట్టిపడేలా సంబరాలు జరుపుకున్నారు. కళాశాల వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల కార్యదర్శి సి.గంగిరెడ్డి, కోశాధికారి సి.అభిషేక్ రెడ్డి, చైర్మన్ రామచంద్ర రెడ్డి ఈ సంబరాలు ప్రతి ఏడాది నిర్వహించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత పోటీలో పాల్గొన్న విద్యార్థినిలను అభినందించారు.

కలికిరి: పిరమిడ్ జేతవనం ప్రతి ఏటా మూడు రోజులపాటు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలకు మూడు రోజులు ముందు నుండి ముస్తాబవుతోంది. మండలంలోని పత్తేగడ పంచాయతీ కొట్టాల పిరమిడ్ జేతవనంలో ఈ నెల 13, 14, 15వ తేదీలలో ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి వేడుకలుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాలను ఆయన వివరించారు. ఆదివారం ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు సంగీత నాద ధ్యానం, 8.30 గంటలకు స్వర్ణమాల పత్రీజీ అమ్మ సందేశం, 10 గంటల నుండి 12 గంటల వరకు మహర్షి డి.గోపాల్‌రెడ్డి మహాత్మాభాగవతం, 12 గంటల నుంచి ఒంటిగంట వరకు సంగీత నాథ ధ్యానం, ఆరు గంటల నుంచి ఆధ్యాత్మిక సందేశాలు, 8 గంటల నుండి సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు, ఆధ్యాత్మికవేత్తలు హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు.

పంచాయతీ పరిశుభ్రతే ధ్యేయం : 'ఆకేపాటి'

ప్రజాశక్తి - పుల్లంపేట

పంచాయతీలో పరిశుభ్రతే ధ్యేయమని పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. గురువారం పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీలోని చెత్త దిబ్బలను జెసిబి ద్వారా ట్రాక్టర్ల సాయంతో ఊరికి వెలుపల దూరంగా చెత్త దెబ్బలను తరలించారు. అనంతరం గ్రామం మొత్తం బ్లీచింగ్, సున్నం చెల్లించి మురుకు కాలవలో నీరు నిల్వ ఉంచకుండా తగు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిశుభ్రతను పాటించాలని పేర్కొన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రంచలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



చెత్త తొలగించే పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి

నవరత్నాల హామీలు వంద శాతం అమలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన నగర పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లి నుండి ప్రారంభించి ఉజార్లపల్లి, ఎద్దులవారిపల్లి, మొర్రోళ్లపల్లి, నక్కరాసపల్లి, సంద్రామాకులపల్లి, జనుపవారిపల్లి, ఆలేటిపల్లి, బాలసానిపల్లి, తాకటం వారిపల్లి, దేగానిపల్లి, బద్దిపల్లి, అయ్యవారిపల్లి నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, కుల, మత, రాజకీయాలకతీతంగా వాటిని అమలు చేస్తున్న ఏకైక నాయకుడు ఆయనేనని కొనియాడారు. ఇక తంబళ్లపల్లె నియోజకవర్గంలో 40 దశాబ్దాలుగా జరగనటువంటి అభివృద్ధిని కేవలం నాలుగున్నర సంవత్సరాలలో చేసి చూపించామన్నారు.మారుమూల గ్రామాలకు సైతం మౌలిక వసతులు కల్పించామన్నారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలు పరిష్కరించి, సంక్షేమ పథకాలను సకాలంలో అందజేయాలని, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిపెట్టాలన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, కమిషనర్ పి.ఆర్.మనోహర్, ఎంపిడిఒ శంకరయ్య, వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, వైసిపి టౌన్ కన్వీనర్ సిఆర్ చిన్నికృష్ణ, ఐదవ సచివాల కన్వీనర్ రమేష్‌రెడ్డి, నాలుగో సచివాలయం కన్వీనర్ కంచి కళ్యాణ్ కుమార్‌రెడ్డి, భీమ్గాని ప్రభాకర్‌రెడ్డి, జైఎన్ పి.శ్రీనివాసులు, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ భాష, ఎస్ఎస్.ఫయాజ్, గుడిపల్లి సర్పంచ్ గిరిజ రఘునాథ్, మద్దిరెడ్డి సబ్జీ, అభిలాష్‌రెడ్డి, సద్దాం, పవన్, నాయకులు పాల్గొన్నారు.



వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి

స్కిల్ హబ్ సెంటర్‌ను సందర్శించిన కొరియా బృందం



కొరియా బృందంతో శిక్షణ పొందిన అభ్యర్థులు, అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కాలేజీలో ఉన్న స్కిల్ హబ్ సెంటర్‌ను గుడ్ నైబర్స్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ సౌత్ కొరియా బృందం గురువారం సందర్శించింది. సౌత్ కొరియా బృందం స్కిల్ హబ్‌లో ట్రైనింగ్ తీసుకుంటున్న అభ్యర్థులతో మాట్లాడి, వారికి ఎటువంటి ట్రైనింగ్స్ ఇస్తున్నారు, శిక్షణల యొక్క మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి, అవి ఏ విధంగా ఉన్నాయి, శిక్షణ అనంతరం స్కిల్ డెవలప్మెంట్ ద్వారా వారికి ఏ విధమైనా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారనే దాని గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ సౌత్ కొరియా టీమ్ మెంబర్స్ (హన్, జమ్మిలియా, మరియు సందీప్ గుప్త)కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏ విధంగా పనిచేస్తుంది వాటి ద్వారా ఎలాంటి నైపుణ్య కార్యక్రమాలు జిల్లాలో జరుగుతున్నాయి అని దాని గురించి పూర్తిగా వివరించామని పేర్కొన్నారు. అనంతరం సౌత్ కొరియా టీమ్ మెంబర్స్ ఇక్కడ శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులతో పూర్తిగా మాట్లాడం, తర్వాత రాబోయే రోజులలో వారికి గుడ్ నైబర్స్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ తరపు నుండి ఉపాధి అవకాశాలలో తమ వంతు సాయంతం చేస్తామని, వారి ఆర్గనైజేషన్ తరపు నుండి వీలైనంతవరకు మన అభ్యర్థులకు, జిల్లాలో జరిగే అన్ని ట్రైనింగ్ సెంటర్లో ట్రైనింగ్ తీసుకుంటున్నటువంటి వారికి, వారు సహాయం చేస్తామని పేర్కొన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ గుడ్ నైబర్స్ టీం మెంబెర్స్‌ని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గుడ్ నైబర్స్ మేనేజర్ నాగేశ్వరావు, కొరియా టీం మెంబెర్స్, శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

ప్రజాశక్తి-రామాపురం

మామిడి పూత, పిందె దశలో ఉన్నప్పుడు సస్యరక్షణ చర్యలు తప్పనిసరని ఉద్యానశాఖాధికారి నాగమణి పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాచపల్లి, హసనపురం గ్రామాల్లో మామిడి పూత, పిందె సమయాల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు శిఓణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూత త్వరగా, ఒకే సారి రావడానికి, ఆడపూల శాతం పెరగడానికి 13-0-45 (మల్టీ -కె) 10 గ్రాములు లీటర్ నీటికి, మాంగో స్పెషల్ 5 గ్రాములు లీటర్ నీటికి, ఫార్ములా 4ఎ 5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. మామిడిలో మొగ్గ దశలో తేన మంచు పురుగు, మసి తెగులు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం ఉందని వీటి నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మిలీలీటర్ ఒక లీటర్ నీటికి, మ్యాంగోకోజెబ్ 2 గ్రాములు లీటర్ నీటికి పిచికారి చేయాలని చెప్పారు. పచ్చి పూత దశలో ఆశించే తేన మంచు పురుగు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు నివారణకు బుప్రోఫెజిన్ 1.5 మిల్లీలీటర్ ఒక లీటర్ నీటికి, కంటాఫ్ 2 మిల్లీ లీటర్ నీటికి అజాడిర్రెక్టిన్ 2 మి లీ లీటర్ నీటికి పిచికారి చేయాలని రైతులకు తెలిపారు. తెల్ల పూత దశలో ఎలాంటి రసాయన మందులు పిచికారీ చేయకూడదని తెలిపారు. మామిడి నల్ల పూత దశ అనగా పిందె బఠాణీ గింజ సైజులో ఉన్నప్పుడు ఆశించే తేనె మంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు, పిందె రాలడం నివారణకు బుప్రోఫెజిన్ ఎసిఫెట్ 1 గ్రాముల లీటర్ నీటికి, సాప్ 2 గ్రాముల లీటర్ నీటికి, ప్లానోఫిక్స్ 0.25 మి లీ లీటర్ నీటికి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. మామిడి పిందెలు గోలి కాయ నుంచి నిమ్మ కాయ సైజు ఉన్నప్పుడు 10 సంవత్సారాలు పై బడిన చెట్లకు రెండవ సారి ఎరువులు అనగా యూరియా 1 కేజీ, పొటాష్ 750 గ్రా. చెట్లకు చొప్పున భూమిలో వేసి ఫిబ్రవరి, మార్చి నెలల్లో నీటి తడులని 15 రోజులకొక సారి ఇవ్వాలని సూచించారు. మామిడి గోలికాయ దశ నుండి నిమ్మ కాయ దశ వరకు ఆశించే తోడిమ కుళ్ళు తెగులు నివారణకు అమిస్టార్ 1 మిలీ లీటర్ నీటికి లేదా నాటివో 1 గ్రాముల లీటర్ నీటికి పిచకారి రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బికె సహాయకులు అప్సర్ అలీఖాన్, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యాన అధికారి నాగమణి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

ఆటలతోనే ఆరోగ్యం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

యువతకు ఆటలతో ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎంపిడిఒ సురేంద్రనాథ్ తెలిపారు. గురువారం ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. రేణుమాకులపల్లి ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. కొట్టాల, ఎద్దులవారిపల్లి, కోటకొండ, తంబళ్లపల్లి, జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నట్లు పీడీ మొగల్ ఖాదర్బాషా తెలిపారు. శుక్రవారం సెమీఫైనల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. కన్యమడుగు ఉన్నత పాఠశాల మైదానంలో బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. కార్యక్రమాలలో ప్రధానోపాధ్యాయులు రమేష్, మదన్మోహన్, పిఇటిలు చలపతిరెడ్డి, రాజు, లతా, పంచాయతీ కార్యదర్శులు కాశమ్మ, సుశీల పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు సంక్రాంతి కానుక

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు గ్రామపంచాయతీ కార్మికులకు సర్పంచ్ షేక్ జీనత్ షఫీ సంక్రాంతి కానుక పంపిణీ చేశారు. గురువారం స్థానిక పంచాయతీ పరిధిలో పనిచేస్తుంటే కార్మికులు, సిబ్బంది అందరికీ మగవారికి ప్యాంట్, షర్టు, మహిళలకు ఒక చీర రెండు రవికలు, కుట్టు కూలీని సంక్రాంతి కానుకగా అందరికీ పంచి పెట్టారు. కార్మికులు, సిబ్బంది అందరూ సంతోషం వ్యక్తం చేస్తూ సర్పంచ్ షేక్ జీనత్ షఫీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి జయమ్మ, ఇఒ రెడ్డి ప్రసాద్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ జిల్లాల మహిళా జోనల్ ఇన్‌ఛార్జి మహిత ఆనంద్, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హుమయున్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కూనా సత్యం, మాజీ ఎంపిటిసి సుధాకర్, పాల్గొన్నారు.



కార్మికులకు సంక్రాంతి కానుక అందజేస్తున్న సర్పంచ్



మాట్లాడుతున్న కార్యదర్శి సరోజ

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్

ప్రజాశక్తి- గాలివీడు

కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మెషిన్ కింద ప్రతి పల్లెకూ రూ. 10 లక్షల మేర నిధులు మంజూరు చేసి కుళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం గొరాన్ చెరువు సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పల్లెకు బోరు, మోటరు, కుళాయి కనెక్షన్లు స్టోరేజ్ అవకాశం మార్చి లోపు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎక్కడైనా ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోతే ప్రయివేట్ స్థలంలోనైనా ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ జెఇ ప్రతాపరెడ్డి పంచాయతీ కార్యదర్శి సరోజ, సర్పంచ్ దాదినేని దీప్తి, వెంకటాద్రి, దాసరి మధుసూదన్‌రెడ్డి, సచివాల ఉద్యోగులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సామూహిక షష్టిపూర్తి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పీలేరు

అఖిల భారత స్థాయి 32వ బ్రాహ్మణ పరిచయ వివాహ వేదిక, ఉచిత సామూహిక షష్టిపూర్తి కార్యక్రమాల పోస్టర్‌ను బ్రాహ్మణ సేవా సంఘం గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 28న 32వ అఖిల భారత స్థాయి అన్ని బ్రాహ్మణ శాఖల వధూవరుల వివాహ పరిచయ వేదిక, ఉచిత షష్టిపూర్తి కార్యక్రమం తిరుపతి కంచిమఠం, ఇస్కాన్ టెంపుల్ ఎదురుగా నిర్వహించబడునని తెలియజేశారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లి

మండలంలోని వెలుగు ప్రత్యేక పాఠశాల వృద్ధాశ్రమంలో వైసిపి నాయకులు నిస్సార్ అహమద్ గురువారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్ రెడ్డి తెలిపారు. నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూరాబోవు ఎన్నికలలో ఎమ్యెల్యేగా పోటీ చేయుచున్న సందర్భంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు నిస్సార్ అహ్మద్



నిరాహార దీక్ష చేస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు

కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-నందలూరు

కొత్త పింఛను పద్ధతిని రద్దు చేయాలని, పాత పింఛను విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు రైల్వేస్టేషన్ ఎదుట ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ సెక్రెటరీ కె.విశ్వనాథ్ మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని, పదవీ విరమణ తరువాత స్వల్ప పింఛను వస్తుందని, మా కుటుంబాలను ఎలా పోషించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీలు బి.సిద్ధయ్య, సి.వినోద్ కుమార్, ఎస్.మహబూబ్ బాషా, వైస్ చైర్మన్‌లు ఎస్.నరసింహులు, బి.వి.శివ కుమార్ రాజు, కార్మికులు బి.సుధీర్ కుమార్, పి.పీరయ్య, ఎన్.నరసింహులు, ఎస్.కె.షావల్లి, ఆకుల నాగరాజు, జావేద్, పి.డి.కే.కిషోర్, టి.బాల సుబ్రమణ్యం, ఎం.శ్రీహర్ష, ఎస్.పి.సాగర్ మొదలగు కార్మికులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లక్ష్మీపతి

సామాజిక సమానత్వాన్ని పాటిద్దాం: డిఎల్‌డిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా నిమ్మనపల్లి సచివాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి మదనపల్లి డిఎల్‌డిఒ లక్ష్మీపతి, ఎంపిపి నరసింహులు నివాళులు అర్పించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ శేషగిరిరావు, నాయకులు శ్రీనివాసులు, రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ సూచించిన సామాజిక న్యాయం బాటలో అందరూ నడుచుకుంటామంటూ ఫ్లెక్సీపై సంతకాలను సేకరించారు. మండల వ్యాప్తంగా ప్రతి సచివాలయంలోనూ సామాజిక సమత సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మల్లప్ప, పంచాయతీ కార్యదర్శిలు వెంకటరమణారెడ్డి, రాజేష్, నాయకులు శ్రీనివాసులు, రమణ, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి రూ.17 వేలు జరిమానా

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ వ్యక్తికి న్యాయమూర్తి గురువారం రూ.17 వేలు జరిమానా విధించారని, జరిమానా కట్టలేని పక్షంలో మూడు నెలల సాధారణ జైలు శిక్షను అనుభవించాలని తీర్పులో పేర్కొన్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ముష్టూరు పంచాయతీ, దిగువపల్లెకు చెందిన రావల్ మంజు సింగ్ (39) ఐదు రోజుల క్రితం మద్యం సేవించి రోడ్డుపై బండి నడుపుతూ పట్టుపడ్డాడని తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి అతనిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్ ఎదుట హాజరు పరచగా మంజు సింగ్‌కు న్యాయమూర్తి అపరాధ రుసుంగా రూ.17 వేలు చెల్లించాలని, అపరాధ రుసుమును చెల్లించలేని పక్షంలో మూడు నెలల సాధారణ జైలు శిక్షను అనుభవించాలని తీర్పులో పేర్కొన్నట్లు తెలిపారు. మద్యం సేవించి రోడ్డుపై వాహనాలు నడపరాదని, పోలీసుల హెచ్చరికలను ఉల్లంఘించి డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని హెచ్చరించారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా సిద్ధం : ఇఆర్‌ఒ

ప్రజాశక్తి-పీలేరు

ఈ నెల 22వ తేదీకి తప్పులు లేని ఓటర్ల జాబితాను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పీలేరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి గోపాలకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో పీలేరు నియోజకవర్గ స్థాయి రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఆర్‌ఒ మాట్లాడుతూ ఇప్పటి వరకు అందిన క్లైములను త్వరగా పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని తహశీల్దారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు ఇక అవకాశం లేదన్నారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు అన్నది నిరంతర ప్రక్రియని, అది నిరంతరం కొనసాగుతుందని, ఈ ప్రక్రియ నామినేషన్ గడువు రోజు వరకు కూడా ఉంటుందని తెలియజేశారు. 22వ తేదీ తర్వాత వచ్చే క్లైములన్నీ మార్పులు చేర్పుల జాబితాగా కొత్త ఓటర్ల ముసాయిదాకు జత పరచి, రాజకీయ పార్టీలకు అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు. సమావేశంలో 163 పీలేరు నియోజకవర్గ పరిధిలోని గుర్రంకొండ, కలకడ, కెవి పల్లి, వాల్మీకిపురం, కలికిరి, పీలేరు మండలాల రెవెన్యూ అధికారులు, జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వతంత్ర ఎంపీ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-మదనపల్లి

రాజంపేట పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా తనను ఆదరించి రాబోయే ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాలని మదనపల్లికి చెందిన న్యాయవాది తుర్లు ఆనంద్ యాదవ్ గురువారం తంబల్లపల్లి నియోజకవర్గ పరిధిలోని పులికల్లులో ఇంటింటింకి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కరపత్రాలు పంపిణీ అనంతరం ప్రజలతో కలిసి చర్చించినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తనను గెలిపించాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ దిగువమాచిరెడ్డిగారిపల్లి సమీపంలో కరమల శ్రీరామాచారి అనే వ్యక్తి నాటు సారాను తీసుకువచ్చి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. ఆ సమాచారం మేరకు నాటు సారా విక్రయ స్థావరంపై పోలీసులు దాడి చేసి శ్రీరామాచారిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, శివరామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు పేకాట రాయుళ్లు...

ప్రజాశక్తి-ములకలచెరువు

పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని కోనేటివారిపల్లి పంచాయతీ ఏడుమడకలవారిపల్లిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో రూ.7140 నగదు స్వాధీనం చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.